# అడల్ట్స్ ఓన్లీ కథ



# A జీవన రాగం


హేమంత ఆఫీసు నుండి బయటకి వచ్చేసరికి బాగా ఆలస్యం అయింది. అదృష్టవశాత్తు భర్త వరుణ్ ఇంకా ఓపికగా ఆమె కోసం ఎదురు చూస్తున్నాడు. ''సారీ అండీ! బయల్దేరేముందు మా బాస్ అర్జంట్ పని ఒప్పచెప్పాడు. ఎంతసేపయింది మీరు వచ్చి?''

''ఇరవయి మూడు నిముషాల నలభయి సెకన్లు...'' వరుణ్ ప్రసన్నంగానే జవాబు ఇచ్చాడు కాని అతనికి బాగానే కోపం వచ్చింది అని హేమంతకు చప్పున అర్థమయింది. ''సారీ అండీ.. రియల్లీ సారీ..'' అంది. వరుణ్ హెల్మెట్ పెట్టుకుని మాట్లాడకుండా బైక్ స్టార్ట్ చేశాడు.

హెల్మెట్ వల్లనే కాదు, వరుణ్‌కి కోపం తగ్గకపోవటం వల్ల కూడా వారి ప్రయాణం మౌనంగా జరిగింది.

ఇంటికి వచ్చాక హేమంత తప్పుని బాగా క్యాష్ చేసుకున్నాడు వరుణ్. సోఫాలో కూలబడి హేమంత ఇచ్చిన టీ తాగాడు. త్వరగా స్నానం చేసి లుంగీ కట్టుకుని టీపాయ్ పైన కాళ్లు జాపుకుని రిమోట్‌తో టి.వి ఆన్ చేశాడు.

అక్కడ కిచెన్‌లో హేమంత పళ్లు కొరుక్కుంది. ఇప్పుడు పనంతా తనే చేయాలి. ఆఫీసు నుంచి బయట పడేముందు తనని అడ్డుకుని పని ఇచ్చిన బాస్‌ని తిట్టుకుంది హేమంత. తను ఆలస్యం చేసిన మాట నిజమే కాని దాన్ని ఆసరాగా తీసుకుని ఇప్పుడు రెచ్చిపోతున్న పతిదేవుడ్ని చూస్తుంటే ఆమె ఒంటికి కారం పూసినట్లయింది. క్రితం వారం అతను ఆమెని పిక్ అప్ చేసుకోవటానికి లేట్‌గా వచ్చాడు. బుద్ధి తక్కువయి అప్పుడు అతన్ని విసుక్కున్నంతమాత్రాన ఇలా బదులు తీర్చుకోవాలా? సాధారణంగా వరుణ్ ఇంటి పనిలో ఆమెకి సాయం చేస్తాడు కాని ఇప్పుడు తన తప్పుని ఇలా ఎత్తిచూపించాలా? బాస్ మీద కోపాన్ని, భర్త మీద అసహనాన్ని అంతా వంట పైన చూపెట్టింది హేమంత. అసలే ఆమెకి వంట బాగా రాదు.



''టి.వి.లో చాలా మంచి ప్రోగ్రామ్‌లు వచ్చాయి హేమా!'' అన్నాడు వరుణ్ కూర కంచంలో వడ్డించుకుంటూ. ''గమ్మత్తయిన రంగుతో అంతుపట్టని ఆకారంతో వున్న ఈ కూర చిత్రంగా వుందే... ఇంతకీ ఏ కూర ఇది?''

అతని మాటలలోని మొదటి భాగానికీ రెండో భాగంలోని కామెంట్‌కీ జవాబుగా పళ్లు పటపటా కొరికింది హేమంత. రెండో భాగంలోని ప్రశ్నకి సమాధానంగా 'బంగాళాదుంప' అంది. అతను ఆక్షేపించేలోగానే సంజాయిషీ ఇచ్చింది. ''కొంత మాడింది. ఎడ్జస్ట్ అవండి. టి.విలో వచ్చిన మంచి ప్రోగ్రామ్‌లు తలుచుకుంటూ తినండి. బాగానే వుంటుంది!''

''ఎడ్జస్ట్ అయ్యే ఓపిక నాకు లేదు'' అంటూ కూరని పక్కకి తోశాడు వరుణ్.

''మీరూ వచ్చి కిచెన్‌లో నాకు సాయం చేస్తే ఇలా అయ్యేది కాదుగా?'' ఉక్రోషంగా అంది హేమంత.

ఇక వరుణ్ ఊరుకోలేకపోయాడు. మాటా మాటా పెరిగింది.

హేమంత వండినవన్నీ తీసేసి వెతికి మరీ ఆవకాయ సీసా తీసుకువచ్చాడు వరుణ్. అవసరమయినదానికన్నా ఎక్కువగా లొట్టలు వేశాడు. ''ఆహా! అద్భుతమయిన రుచి! ఎంతయినా అమ్మ పెట్టిన ఆవకాయ రుచి ముందు అమృతమయినా బలాదూర్!'' అన్నాడు హేమంత కూర్చున్న కుర్చీ పక్కన వున్న కుర్చీని ఉద్దేశించి.

హేమంతకీ చిర్రెత్తుకు

**శ్రీ ఉదయిని**

వచ్చింది. తటాలున లేచి కంచంతో పాటు వెళ్లి టి.వి ముందు సోఫాలో సెటిల్ అయింది.

అతను గొడవ చేస్తున్నాడని ఆమె టి.వి పెద్దగా పెట్టింది. ఆమె టి.వి వాల్యూమ్ పెంచిందని అతను లొట్టల శబ్దం పెంచాడు.

ఒకరి మొహం ఒకరు చూడకుండా, ఒకరితో ఒకరు మాట్లాడకుండా వారి భోజనం పూర్తి అయింది.

ఆ సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్‌లో అలక మందిరం అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు కాని ఇద్దరూ గొడవ పడ్డప్పుడు హేమంత బెడ్‌రూమ్ పక్కన వున్న బాల్కనీలో మౌనంగా కూర్చుంటుంది.

ఇప్పుడు కూడా ఓ స్టూల్ తీసుకుని బాల్కని క్రీ నీడలో కూర్చుంది హేమంత.

ఫ్లాట్‌లో అన్ని తలుపులు వేసి వుండటంతోనో లేక తన కోపం వల్లనో అంతవరకూ ఊపిరి ఆడనట్లు వేడిగా వున్న వాతావరణం ఒక్కసారిగా మారినట్లు తోచింది హేమంతకి.

చల్లటి గాలి చక్కగా పరామర్శించింది. మసక వెన్నెల నువ్వు ఎవరికీ కనబడవులే అని అభయమిచ్చినట్లు అనిపించటంతో బాల్కని రెయిలింగ్ మీద తల ఆన్చి కళ్లు మూసుకుంది హేమంత.


పక్కగా వున్న ఇళ్ల నుండి పెద్దగా శబ్దాలు వినబడటం లేదు. రోడ్‌కి దూరంగా వుండటంతో నిర్మానుష్యంగా వుంది.

ఎక్కువగా రియాక్ట్ అయ్యానేమో అన్న ఊహ మెల్లగా కలగసాగింది ఆమెకి. నిజమే! తనకి వంట సరిగా రాదు. ఆ మాట వరుణ్ ఎత్తి చూపించినప్పుడల్లా ఉక్రోషపడుతుంది తను. ఇక ఆ తరువాత కంట్రోల్ పోతుంది. అయినా వరుణ్ మాత్రం అర్థం చేసుకోవాలి కదా!

అక్కడ వరుణ్ మనసులో కూడా ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి. భోజనం తరువాత సిగరెట్ తాగటం అతని అలవాటు. అయితే ధూమపానం తప్పనిసరిగా బాల్కనీలోనే జరగాలని హేమంత ఓ రూల్ పెట్టింది. ఇప్పుడు బాల్కనీలో ఆమె వుంది.. వెళ్లాలా వద్దా..

పంతాన్ని అలవాటు జయించింది. అగ్గిపెట్టె, సిగరెట్ పట్టుకుని బాల్కనీలోకి వెళ్లాడు.

హేమంత మొహం సగం క్రీనీడలో దాక్కుంటే మిగిలిన సగం లేత వెన్నెలలో మెరిసిపోతున్నది. ఆమె ధరించిన తెల్లటి నైటీ గాలికి రెపరెపలాడుతుంటే అతని గుండె ప్రతిగా స్పందించటం ప్రారంభించింది. టి.విలో అప్పుడప్పుడూ కనబడే బ్లాక్ అండ్ వైట్ సినిమాలలో దృశ్యాలు గుర్తుకువచ్చాయి అతనికి. బాల్కనీని సగం చీకటి, సగం వెన్నెల డయాగ్నల్‌గా పంచుకోవటం ఓ పోర్ట్రయిట్‌లా తోచింది అతనికి. చల్లగా వీస్తున్న పిల్లతెమ్మెర అతనికి కూడా స్వాంతన కలిగించింది. ''పాపం! హేమ మొహం ఇంకా సీరియస్‌గా వుంది. తను కొంచెం ఓవర్ చేశాడేమో!'' అతనికి గిల్టీగా అనిపించింది. ''కాని హేమ తప్పు కూడా వుంది కదా! ఆమె పలకరిస్తే అప్పుడు సౌమ్యంగా మాట్లాడితే సరి!'' అతను మౌనంగా నిలబడిపోయాడు.



ఉన్నట్లుండి వేణుగానం వినబడింది. గాలి కెరటాల పైన సుతిమెత్తని సుతారంగా తేలియాడుతూ చెవులకి సోకిన ఆ మురళీనాదం ఇద్దరికీ పరవశం కలగచేసింది. ఎప్పటికో పాత సినిమా పాట. ఏదో సరిగా ఊహించలేకపోయినా ఎప్పుడో విన్న శ్రావ్యమయిన పాట ట్యూన్‌ని ఎవరో కాని ఫ్లూట్ పైన చక్కగా పలికిస్తున్నారు. ఇద్దరూ ముగ్ధులయి విన్నారు.

ఆమె పలకరిస్తేనే నోరు విప్పాలనుకున్న పంతాన్ని మరిచిపోయాడు వరుణ్. ''ఏ పాట అది? నాకు గుర్తుకు రావటం లేదు'' అప్రయత్నంగా అడిగాడు.

''నాకూ చాలాసేపటివరకూ గుర్తుకురాలేదు. తరువాత తెలిసింది... ఎచటి నుండి వీచెనో ఈ చల్లని గాలి అన్న పాట అది! ఒకసారి ఏమయిందంటే ఆయన ఈ పాట వింటున్నారు. నేను స్టీరియోలో ఛయ్య ఛయ్యా పాటని ఇల్లు అదిరేలాగా పెట్టాను. అప్పుడు చూడు ఇక నా బుర్ర వాచిపోయేలాగా చివాట్లు పెట్టారు.''

అతనితో పాటు హేమంత కూడా నవ్వింది.

రెండుమూడు నిముషాల విరామం అనంతరం మళ్లీ ఇంకో పాట ట్యూన్‌ని వేణువు పలికించటం మొదలయింది. చల్లని వాతావరణంలో ఎవరో అజ్ఞాత వాయిద్యకారుడు తామిద్దరి కోసమే కచేరి చేస్తున్న భావన కలిగింది ఇద్దరికీ.

అలా మూడు నాలుగు పాటలు విన్నారు.

బాల్కనీలోకి వచ్చినప్పటి రుసరుసలు పోయాయి. కోపతాపాలు మాయమయ్యాయి.

## నేనేంటో నిరూపిస్తా

**'రోడ్' సినిమాలో ఐటమ్ నెంబర్ చేసిన అందరి దృష్టిలోకీ వచ్చిన కొయినా మిత్రా ఇప్పుడు హీరోయిన్‌గా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇంత పోటీలో మీరు రాణించగలరంటారా? అంటే- నాకేం తక్కువ. ముప్పయ్యేసి ఏళ్లకి పైబడిన తారలు సైతం హీరోయిన్లుగా రాణించేస్తుంటే నేనెందుకు సాధించలేను. నాకిప్పుడు 22 ఏళ్లే. ఇంకా బోలెడు టైముంది. నేనేంటో నిరూపించుకుంటా' అంటోంది ఈ గ్లామర్ భామ.**

## గుడ్‌గాళ్ సమీరా!

నేటి యంగ్ తారలకి బొత్తిగా టైమ్‌సెన్స్ తెలీదని వాపోయే వారిని ఆశ్చర్యపరిచేలా ప్రవర్తించింది ఇటీవల సమీరా రెడ్డి. నిర్మాత దినేష్ పటేల్ తాను తీస్తున్న చిత్రం షూటింగ్‌ని తప్పనిసరై తెల్లవారుఝూము షిఫ్ట్‌లో పెట్టుకున్నాడే గానీ సమీరా టైమ్‌కి వస్తుందో రాదోనని బెంగపడుతూనే వున్నాడు. కారణం ఏంటంటే- ఆ ముందు రాత్రే ఓ బ్రహ్మాండమైన ఫంక్షన్‌లో సమీరా పాల్గొందని అతనికి తెలుసు. అందువల్ల అక్కడ అలసటతో రాదేమోనని అనుకునేంతలోనే తిన్నగా ఆ ఫంక్షన్ నుంచి షూటింగ్ స్పాట్‌కి సమీరా రావడం షూటింగ్ మొదలెట్టండని త్వరపరచడం చూసి నివ్వెరపోయాట్ట దినేష్.

మనసులు ఆహ్లాదంగా మారటంతో తనువులు దగ్గరవ్వాలనే తీయని తహతహల తపన తీవ్రస్థాయికి చేరింది. చేతిలో చేయి కలిపి నవ్వులు పంచుకుంటూ ఇద్దరూ శయ్యపైకి చేరారు.

కొన్ని నిమిషాల తరువాత అతని భుజంపైన తల వాల్చి అలుపు తీర్చుకుంటూ అతన్ని హత్తుకుపోయిన ఆమెకి, ఆమెని అతి దగ్గరగా పొదువుకుని సేద తీరుతున్న అతనికి దూరం నించి వేణునాదం వినిపిస్తున్నట్లు తోచింది. ఆ అజ్ఞాత వ్యక్తికి మనసులోనే మౌనంగా కృతజ్ఞతలు చెప్పుకున్నారు.

ఆ రాత్రి నుండీ భోజనం తరువాత బాల్కనీలో కూర్చుని ఆ వేణుగానం కోసం ఎదురుచూడటం, విని ఆనందించటం ఓ అలవాటుగా వలపు సయ్యాటకి తొలి పలుకుగా మారింది వారికి. ఎవరో కాని పాత తెలుగు పాటలే వాయించేవారు... ఆ పాటలు అన్నీ తెలియకపోయినా మురళీనాదంలో ఏదో మాధుర్యం ఉన్నట్లు తోచేది వారికి.

అది జరిగిన నాలుగో రోజు శనివారం... హేమంతకి ఆఫీస్ సగం దినం మాత్రమే! కానీ వరుణ్‌కి మాత్రం మీటింగ్‌ల వల్ల ఆఫీసు నుండి రావటం ఆలస్యం అవుతుంది. సాయంకాలం ఏం తోచక టీవీ చూస్తున్న హేమంతకి చటుక్కున ఓ ఆలోచన కలిగింది. వెంటనే అమలుపెట్టింది.

గబగబా తయారయి ఫ్లాట్‌కి తాళం పెట్టి బయటపడింది హేమంత. వేణుగానం ఎటునుంచి వినబడిందో ఆ వీధి వేపు నడిచింది. రోడ్డుమీద ఆడుకుంటున్న పిల్లలని అడిగి మొత్తం మీద కూపీ తీసి అది వాయించేది ఎవరో ఏ ఇంట్లో ఉంటారో కనుక్కుంది.

...తలుపు తట్టింది.


యాభై అయిదేళ్ల వయసు ఉన్న ఓ స్త్రీ తలుపు తీసింది. హేమంత పరిచయం చేసుకుంది.

''నిజంగా ఆంటీ! మా బాల్కనీలోంచి వింటుంటే ఆ మురళీనాదం ఎంతో అద్భుతంగా ఉంటుంది... ఎంత హాయిగా ఉంటుందో తెలుసా?..''

ఆవిడ నవ్వింది. ఆ నవ్వు క్రీనీడలో ఉన్న విషాదాన్ని హేమంత గమనించలేదు.

''ఆయన రిటైర్ అయ్యాక నేర్చుకోవటం మొదలుపెట్టారు... పొద్దునంతా వాక్‌మన్‌లో ఆ పాటలు వింటారు... ఆ తరువాత ఆ పాట వింటూనే ఫ్లూట్ వాయించటం ప్రాక్టీస్ చేస్తారు. నిజానికి ఆయనకి శాస్త్రీయ సంగీతజ్ఞానం లేదు.. గురువూ లేడు.. అంతా స్వయం సాధనే!'' ఆవిడ కించిత్తు గర్వంగా చెప్పింది.

''అలా అయితే అంకుల్ నిజంగా గ్రేట్! అవును ఆంటీ! నిన్న రాత్రి ఆయన వాయించిన పాట అప్పుడు గుర్తుకురాలేదు...మీతో మాట్లాడుతుంటే ఇప్పుడు టక్కున గుర్తుకువచ్చింది. అది 'మనసు పరవశించెనే తనువు పులకరించెనే' అన్న పాట కదూ... నేను అబద్ధం చెప్పటం లేదు...వింటుంటే నిజంగా మనసు పరవశించింది ఆంటీ!...''



ఆ పొగడ్తలకి ఆవిడ మురిసిపోయింది. ''అంకుల్ ఉంటే ఎంతో సంతోషించే వాళ్లమ్మా!... ఆయన పనిమీద బయటికి వెళ్లారు...'' అంది.

''రేపు ఆదివారం సాయంకాలం ఆయన ఇంట్లో ఉంటారా?... మీకు అభ్యంతరం లేకపోతే మా ఆయనని తీసుకువస్తాను...'' హేమంత అడిగింది.

''తప్పకుండా తీసుకురా...'' అంది ఆవిడ.

కొంచెంసేపు మాట్లాడి హేమంత ''ఇక వెళ్లొస్తాను ఆంటీ...'' అని లేచింది.

''ఒక్క నిమిషం అమ్మా! నిన్ను ఉట్టి చేతులతో ఎలా పంపించాలి?... పళ్లు ఏవీ లేవు...'' అంటూ ఆవిడ మథనపడింది... ''నువ్వు ఏం అనుకోకపోతే...'' అంటూ సందేహంగా ఆగింది.

''ఫర్వాలేదు ఆంటీ! చెప్పండి.''

''అంకుల్‌కి రసం అంటే చాలా ఇష్టం! ఆయన కోసం రసం పొడి ఇప్పుడే గ్రైండ్ చేశాను...నువ్వు తీసుకువెళ్లాలి!''

హేమంత నవ్వింది. ''మా

ఆయనకీ రసం అంటే ప్రాణం! పాపం నేను చేసే రసం రుచి చూసి నీరసపడిపోతారు...'' అంది.

ఆవిడ ఘుమఘుమలాడే రసం పోసి ఓ చిన్న పెట్ జార్‌లో ఇచ్చింది. ఆ సీసా మూత తీయకుండానే వాసన చూసి 'థాంక్స్ ఆంటీ! ఈరోజు మా వరుణ్ రసం ఇంత అద్భుతంగా ఎలా చేశానా అని తప్పకుండా ఆశ్చర్యపోతాడు...'' అంది.

హేమంత సరిగానే ఊహించింది. ఆఫీసు నుండి వస్తూనే వరుణ్ గాలి గట్టిగా పీల్చి ''ఆహా! ఏమా సువాసన! అచ్చు అమ్మ చేసిన రసం లాగానే ఉంది...'' అన్నాడు.

హేమంత తను చేసిన డిటెక్షన్ అంతా వివరించింది.

రసం తింటూ మైమరచిపోయాడు వరుణ్. ''ఆ ఫ్లూట్ గాన రసానికి ఆయనకి, అమోఘమైన ఈ రసానికి ఆవిడకి థాంక్స్ చెప్పాలోయ్'' అన్నాడు.

ఆ రాత్రి బాల్కనీలో వాళ్లకి ఓ పెద్ద సర్‌ప్రైజ్ ఎదురయింది. అంతవరకూ పాతపాటలే వినిపించిన ఆ ఫ్లూట్ ఆ రేయి- చారుమతి ఐ లవ్ యూ చంద్రముఖి ఐ లవ్ యూ... అన్న సరికొత్త పాట పలికించటం విని ఇద్దరూ ఆశ్చర్యపోయారు. ఆ కొత్త సినిమా బాగుందని వాళ్లు రెండుసార్లు చూశారు కూడా. ఆ పాటని బాగా ఎంజాయ్ చేశారు.

ఆదివారం సాయంకాలం వరుణ్, హేమంత వాళ్లింటికి వెళ్లారు. ఈసారి ఉట్టి చేతులతో కాకుండా పళ్లు, పూలు తీసుకువెళ్లింది హేమంత.

ఆవిడ వీళ్లిద్దర్నీ ఆప్యాయంగా ఆహ్వానించింది.

లోపలనుంచి ఆయన ప్రాక్టీస్ చేసుకుంటున్న శబ్దాలు వినబడుతున్నాయి. ఆవిడ వెళ్లి పిలుచుకుని వచ్చింది. చేతిలో ఫ్లూట్ పట్టుకుని వచ్చాడు ఆయన. దాదాపు అరవై ఏళ్లు ఉంటాయి.

వరుణ్, హేమంత ఆయనని పొగుడుతుంటే ఆయన మౌనంగా తల ఊపుతూ ఉండిపోయాడు. నోరు విప్పలేదు. ఆయన ఎందుకు మాట్లాడటం లేదో ఇద్దరికీ అర్థం అవ్వలేదు.

కొంచెంసేపు తరువాత ఆయన ఆవిడ వంక చూసి తల స్వల్పంగా కదిపాడు. ''సరే! మీరు వెళ్లండి...'' అంది ఆవిడ.

ఆయన వరుణ్, హేమంత వంక నవ్వుతూ చూసి లోపలికి వెళ్లాడు.

అప్పుడు చెప్పింది ఆవిడ. ఆయన కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసేవాడుట. గొంతులో క్యాన్సర్ వల్ల మాట పోయిందంట. ఇక పాఠాలు చెప్పలేక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నాడుట.

అంత గొప్పగా మురళి వాయించే ఆయన మాట్లాడలేడంటే ఇద్దరికీ మనసు కలుక్కుమంది.

క్రమంగా కబుర్లు మామూలు విషయాల వంక మళ్లాయి. ఇంతలో ఫ్లూట్- చారుమతి ఐ లవ్ యూ పాటని మళ్లీ పలికించసాగింది.

వరుణ్ గమనించలేదు కానీ ఆవిడ మోము సిగ్గుతో అరుణిమ దాల్చటం హేమంత కంట పడింది.

''కాఫీ తెస్తాను...'' అంటూ ఆవిడ కిచెన్‌వేపు కదిలింది.

''ఇప్పుడలాంటివి ఏవీ వద్దు ఆంటీ...'' హేమంత అంది.

ఆవిడ నవ్వింది.

''అంకుల్‌కి కాఫీ కావాలిట. ఆయనతో పాటూ మనం కూడా తాగుదాం...'' హేమంత ఆవిడతో పాటు వెళ్లింది.

కాఫీ కలుపుతూ ఆవిడ చెప్పింది. మాటలు పోయాక ఆయన ఆవిడని పిలవాలంటే కూడా ఏ..ఏ..ఏ.. అన్న వికృత శబ్దాలు చేయాల్సి వచ్చేదిట. ఆ శబ్దాలు తన చెవులకే కఠోరంగా వినబడి ఆయన కుమిలిపోయేవాడుట. ''నిన్ను ఎంతో మధురంగా రాణీ అని పిలిచేవాడ్ని... ఇప్పుడు ఇలా ఏ..ఏ..ఏ.. అని పిలవటం అసలు బాగాలేదు'' అని కాయితం మీద రాసి ఆవిడకి చూపించి బాధ పడ్డాడుట. ఆలోచించగా ఆయనకి ఈ పరిష్కారం తోచిందిట... అప్పటివరకూ అలవాటు లేక మురళి వాయించటానికి ఆయాసపడుతున్నా లెక్కచేయకుండా ఆయన ప్రావీణ్యం సాధించాడుట. ''ఇప్పుడు ఆయన నన్ను పిలవాలన్నా, ఏమన్నా చెప్పాలన్నా ఎంతో సులువుగా అలవోకగా చెప్పగలుగుతున్నారు...'' అన్నది ఆవిడ సన్నగా నవ్వుతూ. ఈసారి ఆ నవ్వు వెనకాల దాక్కున్న విషాదాన్ని స్పష్టంగా చూసిన హేమంతకి గుండె పట్టేసినట్లయింది.

ఆ దిగులు నుంచి తప్పించుకోటానికి మాట మారుస్తూ అడిగింది. ''ఆంటీ! నేనో సంగతి అడుగుతాను...ఎక్కువ పరిచయం లేకుండానే ఈ అమ్మాయి ఏమిటీ ఇంత చనువు తీసుకుంటున్నది అని అనుకోకుండా జవాబు ఇస్తారా... అంకుల్ తనకి కాఫీ కావాలని ఎలా సూచించారు...?''

ఈసారి ఆవిడ మనస్ఫూర్తిగా స్వచ్ఛంగా నవ్వింది. హేమంత వంక సూటిగా చూడలేనట్లు తల వాల్చుకుని చెప్పింది. ''నేను ఇచ్చిన రసం పోడి బ్రహ్మాండంగా ఉందని మీరిద్దరూ పొగిడారు కదూ... ఆయనకీ నేను చేసిన రసం అంటే చాలా ఇష్టం! అయితే దాన్ని ఆయన చారు అని అనేవారు. అందుకనే సరదాగా నన్ను అప్పుడప్పుడూ చారుమతి అని పిలిచేవారు...గొంతు పోయాక అలా పిలిచే అవకాశం లేకపోయింది... ఈ చారుమతి ఐ లవ్ యూ అన్న సినిమా పాట వచ్చాక అందుకనే కష్టపడి దాన్ని నేర్చుకున్నారు... ఆ ట్యూన్ వాయిస్తే నాతో ఏదో పని ఉన్నట్లు ఇప్పుడు మా మధ్య కొత్త సంకేతం అన్నమాట!...''

ఆ దంపతుల దగ్గర నించి సెలవు తీసుకుంటూ హేమంత వరుణ్‌కి సన్నగా సంజ్ఞ చేసింది. దాన్ని సరిగానే అర్థం చేసుకున్న వరుణ్ ఆమెతో కలిసి ఆ దంపతులకి పాదాభివందనం చేశాడు.

ఫ్లాట్‌కి వెళ్లాక కూడా హేమంత మౌనంగా ఉండిపోయింది. మాట్లాడకుండానే భోజనం చేసింది. ఆమె మూడ్ గమనించిన వరుణ్ ఆమెని పలకరించలేదు.

బాల్కనీలో కూర్చుని వేణుగానానికి ఎదురు చూస్తుంటే నోరు విప్పింది హేమంత. మెల్లగా అంకుల్ ఫ్లూట్ ఎందుకు నేర్చుకున్నాడో వివరించింది. ''వరుణ్! జీవిత భాగస్వామిని కరుకుగా పిలవటం ఇష్టం లేక ఆయన ఫ్లూట్ నేర్చుకున్నాడు. మనకి మంచి గొంతులు ఉన్నాయి. అయినా వాటిని ఒకరిని ఒకరు తిట్టుకోవటానికి, నిందలు వేసుకోవటానికి వాడుతున్నాం. అలా పోట్లాడుతున్నప్పుడు ఆ గొంతులు ఎంత వికృతంగా మారుతున్నాయో ఎందుకు గమనించలేకపోతున్నాం? నిజంగా మనం ఎంత తప్పు చేస్తున్నాం. ఆలోచించండి...'' ఆమె గొంతు రుద్ధమయింది.

ఒక్క నిమిషం ఆగి తిరిగి చెప్పసాగింది. ''ప్రతీ రాత్రి ఫ్లూట్ వింటూ ఎంజాయ్ చేసినందుకే కాదు. ఈ పాఠాన్ని నేర్చుకున్నందుకు కూడా ఆయనకి థాంక్స్ చెప్పాలి...''

అవును అన్నట్లు తల ఊపాడు వరుణ్.

చారుమతి ఐ లవ్ యూ- చంద్రముఖి ఐ లవ్ యూ అన్న ట్యూన్ మృదుమధురంగా వినపడసాగింది. హేమంత వరుణ్‌కి దగ్గరయి కళ్లు మూసుకుంది.

☆

